సాక్షి
కామారెడ్డి

సోమవారం । 18 । నవంబర్ । 2024



తల్లిదండ్రులకు వరం

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఆడపిల్లల తల్లిదండ్రులకు వరాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 9లో ▸



హాజరు సున్నా..

నిజాంసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 18 మంది విద్యార్థులున్నా.. ఒక్కరూ హాజరు కావడం లేదు.

- 9లో ▸



వాతావరణం

ఉదయం మంచు కురుస్తుంది. చలి గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

24న బాన్సువాడకు గరికిపాటి రాక



బాన్సువాడ : సహస్రావధాని గరికిపాటి నరసింహారావు ఈనెల 24న బాన్సువాడకు రానున్నారని అయ్యప్ప నిత్యాన్నదాన ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు శంకర్ గురుస్వామి తెలిపారు. ఆదివారం అయ్యప్ప ఆలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 24న నిర్వహించే కార్యక్రమంలో గరికిపాటి నరసింహారావు పాల్గొని ప్రవచనామృతాన్ని అందిస్తారని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో ట్రస్ట్ సభ్యులు కొత్త కొండ భాస్కర్, మల్లికార్జున్, ర్యాల విఠల్‌రెడ్డి, వీరప్ప, సుధాకర్, మొగులయ్య, సాయిలు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: 108 సంస్థలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్(ఈఎంటీ)గా పనిచేయడానికి ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని 108 జిల్లా మేనేజర్ తిరుపతి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, జీఎన్‌ఎం, ఏఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన 30 ఏళ్లలోపువారు అర్హులని పేర్కొన్నారు. 20న జిల్లా కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. ఆసక్తిగలవారు ఇతర వివరాలకు 91007 99153 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గెలుపోటములు సహజం



నిజామాబాద్ నాగారం: క్రీడల్లో గెలుపోటములు సహజమని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో రెండు రోజులుగా సాగుతున్న బ్యాడ్మింటన్ టోర్నీ ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రతి రోజు క్రీడలకు సమయాన్ని తప్పకుండా కేటాయించలన్నారు. ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ మాట్లాడుతూ నిజామాబాద్ అంటేనే ఎంతో మంది క్రీడాకారులకు పుట్టిన ఇల్లుగా మారిందన్నారు. విజేతలకు జడ్జి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, జాయింట్ సెక్రెటరీ వెంకట్‌రాములు, ట్రెజరర్ గంగకిషన్, ప్రముఖ వ్యాపారవేత్త దేవిదాస్, ఏటీఎస్ శ్రీనివాస్, భక్తవత్సలం, న్యాయవాదులు మానిక్‌రాజ్, ఆశానారాయణ పాల్గొన్నారు.

లింబాద్రి గుట్టను దర్శించుకున్న జడ్జీలు



మోర్తాడ్: భీమ్‌గల్ మండలంలోని లింబాద్రి గుట్టపై నెలకొన్ని శ్రీ లక్ష్మీ నర్సింహస్వామిని జిల్లా జడ్జీ కుంచాల సునీత, ఆర్మూర్ జడ్జీ దీప్తి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారితో ప్రత్యేక పూజలను చేయించి తీర్థ ప్రసాదాలను అందించారు.

అభివృద్ధికి బిల్లుల గండం!

సర్కారు పనులకు సంబంధించిన బిల్లులు సకాలంలో మంజూరు కావడం లేదు. పనులు చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు. బిల్లుల చెల్లింపులో జాప్యంతో కొత్త పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు.

- చేసిన పనులకు మంజూరు కాని నిధులు
- ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్లు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు లేకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిల్లులు రికార్డు అయినా పేమెంట్స్ జరగకపోవడంతో పెట్టుబడులకు తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో మెటల్ కాంపోనెంట్ కింద సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులు చేశారు. ఆయా పనులకు సంబంధించి జిల్లాలో రూ. 10.91 కోట్లు, అలాగే స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్, నియోజకవర్గ అభివృద్ధి నిధులకు సంబంధించి రూ.60 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉంది. ఇవే కాకుండా మన ఊరు -మన బడితో పాటు తాగునీటి కోసం తవ్విన బోర్లు, ఇతర పథకాల ద్వారా చేసిన పనులు రూ. వందల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు పూర్తి చేసి ఇబ్బందులు పడాల్సి వస్తోందని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త పనులు చేయడానికి వెనకడుగు

పాత బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో వివిధ పథకాల ద్వారా మంజూరవుతున్న పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో చాలాచోట్ల టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. వివిధ పథకాల ద్వారా పనులు మంజూరవుతున్నా కాంట్రాక్టర్లు ఆసక్తి చూపకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. పెండింగ్ బిల్లులు క్లియర్ అయితేనే కొత్త పనులు చేసే అవకాశాలున్నాయి.

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు.. (రూ. కోట్లలో)


డివిజన్	ఎన్ఆర్ ఈజీఎస్	ఎస్‌డీఎఫ్/ సీడీపీ
కామారెడ్డి	5.50	20
బాన్సువాడ	5.41	40
మొత్తం	10.91	60

ఉపాధి హామీ బిల్లులు..

జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించారు. కామారెడ్డి పంచాయతీరాజ్ డివిజన్ పరిధిలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు సంబంధించి రూ. 5.50 కోట్లు, బాన్సువాడ డివిజన్‌లోని బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలకు సంబంధించి రూ.5.41 కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. సీసీ రోడ్లు, డ్రయినేజీ పనులన్నీ తాజా మాజీ సర్పంచ్‌లే ఎక్కువ మంది చేశారు. అప్పులు తెచ్చి పనులు చేసి బిల్లులు రాకపోవడంతో వడ్డీలు పెరిగి అప్పుల్లో కూరుకుపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తయినా చేసిన పనులకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇటీవల బిల్లుల కోసం నిరసన కార్యక్రమాలూ చేపట్టారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు.

ఎస్‌డీఎఫ్, సీడీపీ నిధులు కూడా..

స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌తో పాటు నియోజక వర్గ అభివృద్ధి నిధులతో చేపట్టిన పనులకు కూడా బిల్లులు రావడం లేదు. కామారెడ్డి పంచాయతీరాజ్ డివిజన్‌లో ఎస్‌డీఎఫ్, సీడీపీ నిధులు రూ. 20 కోట్ల మేర బకాయిలున్నాయి. అలాగే బాన్సువాడ పీఆర్ డివిజన్ పరిధిలో రూ. 40 కోట్ల మేర బిల్లులు రావాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఎస్‌డీఎఫ్, సీడీపీ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లులు రాకపోవడంతో గొల్లుమంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ కింద అనేక పనులు మంజూరు చేసింది. అప్పట్లో కుల సంఘాల భవనాలు, ఫంక్షన్ హాళ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులకు వాటిని కేటాయించారు. గ్రామ, మండల స్థాయి నాయకులే ఈ పనులు చేశారు. ఏడాది గడచినా బిల్లులు రాకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు డబ్బులు మిగలడం ఏమోగానీ, వడ్డీలతో నడ్డి విరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిజాంసాగర్ ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీరు

యాసంగికి భరోసా!

- నిజాంసాగర్ కింద 1.25 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం
- 7 విడతల్లో 12 టీఎంసీల విడుదలకు ప్రతిపాదనలు
- నారుమళ్ల కోసం నీటిని విడుదల చేస్తున్న అధికారులు

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా కళకళలాడుతుండడంతో యాసంగిపై ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రాజెక్టు ప్రధాన కాలువ పరిధిలో యాసంగి సీజన్‌లో 1.25 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు నీటి విడుదలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. మొదటి ఆయకట్టు కింద అలీసాగర్ రిజర్వాయర్ వరకు వరి పంటల సాగుతో పాటు 10 వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేయనున్నారు. ఆయకట్టు కింద పంటల సాగు అవసరాలతో పాటు పంటలను పూర్తిస్థాయిలో గట్టెక్కించేందుకు 7 విడతల్లో 12 టీఎంసీల నీటిని విడుదల చేయాలని యోచిస్తున్నారు. ప్రధాన జలాశయాల నుంచి నీటి విడుదలతో పాటు ఆయకట్టు కింద పంటల సాగుపై చర్చించేందుకు రెండు, మూడు రోజుల్లో హైదరాబాద్‌లో శివం కమిటీ సమావేశం కానుంది. మంత్రి, రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు పోచారం, కౌలాస్ నాలా ప్రాజెక్టుల నుంచి ఆయకట్టుకు నీటి విడుదల, పంటల సాగుకు సంబంధించి ఇందులో నిర్ణయం తీసుకోనున్నారు. ఈ నెలాఖరు నుంచి వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు నీటిని అందించే అవకాశాలున్నాయి. నారుమళ్లను సిద్ధం చేసుకోవడానికి ముందస్తుగా ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో అన్నదాతలు సాగు పనులకు సన్నద్ధమవుతున్నారు.



సహకార రంగాన్ని అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న కార్పొరేషన్ చైర్మన్ మోహన్‌రెడ్డి

- వ్యాపార అవకాశాలపై దృష్టి సారించాలి
- సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి

పాలకవర్గాలు, అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో సహకార రంగాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి సూచించారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా ఆదివారం నగరంలోని ఐడీసీఎంఎస్ కార్యాలయంలో చైర్మన్ తారాచంద్ నాయక్ అధ్యక్షతన సహకార సంస్థలను వ్యాపార అభివృద్ధి సంస్థలుగా మార్చడంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మానాల మాట్లాడుతూ.. అందరం కలిసి సంస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సహకార సంఘాలు, డీసీఎంఎస్‌లు ధాన్యం కొనుగోళ్ల ద్వారా వచ్చే కమీషన్‌పై నడుస్తున్నాయని, గతంలో ఉద్యోగుల జీతాలకు కూడా ఇబ్బందిగా ఉండేదని గుర్తుచేశారు. వ్యాపార అవకాశాలపై దృష్టి సారించాలని, అందుకు తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. డీసీఎంఎస్ మనుగడ సాగించాలంటే ఎరువుల పంపిణీ ప్రారంభించాలన్నారు. ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ మాట్లాడుతూ సహకార వ్యవస్థ సేవలను భవిష్యత్ తరాలకు అందేలా చూసే బాధ్యత మనందరిపై ఉందన్నారు.

కార్యక్రమంలో టీఎస్‌సీయూ ప్రిన్సిపాల్ వెంకన్న, డీసీసీబీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు కొసరాజు రామకృష్ణ, గంగారెడ్డి, శ్రీధర్, బిజినెస్ మేనేజర్ కె నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్–3 పరీక్ష

- సగం మంది అభ్యర్థుల డుమ్మా!
- నేడు పేపర్–3



సాందీపని పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

కామారెడ్డి టౌన్ : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్–3 పరీక్షలు అదివారం జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా సాగాయి. తొలిరోజు నిర్వహించిన రెండు పరీక్షలకు సుమారు సగం మంది అభ్యర్థులు డుమ్మా కొట్టారు. పేపర్–1 ఉదయం 10 గంటలకు, పేపర్–2 మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కాగా.. అభ్యర్థులను గంటన్నర ముందుగానే కేంద్రంలోనికి అనుమతించారు. అరగంట ముందే నిమిషం నిబంధనతో గేట్లను మూసివేసి తాళాలు వేశారు. నిమిషం ఆలస్యంగా వచ్చిన పలువురిని పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించలేదు. దీంతో వారు నిరాశతో వెనుదిరిగారు. విద్య, వైద్య, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పరీక్ష విధుల్లో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రాలలోనికి అనుమతించారు.

జిల్లాలో 8,268 మంది గ్రూప్–3కి దరఖాస్తు చేసుకున్నారు. వీరికోసం జిల్లాకేంద్రంలో 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం జరిగిన పేపర్–1 పరీక్షకు 4,655 మంది హాజరుకాగా.. 3,613 మంది డుమ్మాకొట్టారు. హాజరు శాతం 56.30 గా నమోదయ్యింది. మధ్యాహ్నం జరిగిన పేపర్ –2 పరీక్షకు 4,644 మంది హాజరు కాగా 3,624 మంది గైర్హాజరయ్యారు. హాజరు శాతం 56.17 గా రికార్డయ్యింది.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ

పట్టణంలోని ఎస్ఆర్‌కే కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ సింధ శర్మ పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కామారెడ్డి ఆర్డీవో రంగనాథ్‌రావు ఆర్‌కే డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు.



ఆర్‌కే డిగ్రీ కళాశాల వద్ద..



సమయం ముగిసిపోవడంతో కేంద్రం లోపలికి అనుమతించని అధికారులు



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ సింధు శర్మ

'సర్కారు'లో మెరుగైన సేవలు

- బాన్సువాడ ఎంసీహెచ్‌లో ప్రతినెలా 300లకుపైగా ప్రసవాలు
- ఇతర జిల్లాల నుంచీ వస్తున్న గర్భిణులు
- నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యత

బాన్సువాడ : బాన్సువాడలోని మాతా శిశు సంరక్షణ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ఎంతో అనుభవం కలిగిన ఫిజీషియన్లు, సర్జన్లు, గైనకాలజిస్టులు ఇక్కడ అందుబాటులో ఉన్నారు. ఉత్తమ సేవలతో దేశంలోనే బెస్ట్ ఫీడింగ్‌గా ఆస్పత్రి అవార్డు సొంతం చేసుకుంది. ఈ ఆస్పత్రికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లానుంచే కాకుండా సంగారెడ్డితోపాటు పొరుగున్న ఉన్న మహారాష్ట్రలోని దెగ్లూర్ గర్భిణులు వస్తున్నారు. దీంతో ప్రతి నెలా మూడు వందలకుపైగా ప్రసవాలు నమోదవుతున్నాయి. బాన్సువాడ ఆస్పత్రిలో రోజూ 15 నుంచి 25 వరకు కాన్పులు అవుతున్నాయి. అందులో 10కి పైగా సాధారణ ప్రసవాలు ఉంటున్నాయి. అనుభవం కలిగిన గైనకాలజిస్టులు, చిన్న పిల్లల వైద్య నిపుణులు ఉండడంతో క్లిష్టమైన కేసులనూ టేకప్ చేస్తూ తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ఆస్పత్రిలో మెరుగైన సేవలు అందించగలుగుతున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

బాన్సువాడ మాతాశిశు ఆస్పత్రిలో ఐదు నెలల్లో జరిగిన ప్రసవాలు..

నెల	సాధారణ ప్రసవాలు	సిజేరియన్లు	మొత్తం
జూన్	188	128	316
జూలై	223	154	377
ఆగస్టు	236	151	387
సెప్టెంబర్	150	153	303
అక్టోబర్	188	155	343



బాన్సువాడ మాతాశిశు సంరక్షణ ఆస్పత్రి

జిల్లాకేంద్రంలో చిమ్మచీకట్లు

- ఎమ్మెల్యే క్యాంపు, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు వెళ్లే దారిలో..
- ఇబ్బందిపడుతున్న ప్రజలు
- వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని అడ్లూర్ రోడ్, కలెక్టరేట్ రోడ్‌లలో రాత్రి వేళ అంధకారం అలుముకుంటోంది. ఈ రోడ్డు వెంట కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలతో పాటు, ఎస్టీ బాలుర హాస్టల్, భవానీనగర్, జయశంకర్ కాలనీలున్నాయి. అశోక్‌నగర్ కాలనీ రైల్వే గేట్ నుంచి అడ్లూర్ గ్రామ ప్రధాన రోడ్డు, అక్కడి నుంచి కలెక్టరేట్ మీదుగా రామారెడ్డి రోడ్ వరకు వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళ ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. పక్షం రోజుల క్రితం అడ్లూర్ గ్రామానికి చెందిన ఓ జంట బైక్‌పై రాత్రి ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తుండగా బైక్‌పై ఇద్దరు దొంగలు వెంబడించి మహిళ మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అలాగే చీకట్లో సరిగ్గా కనబడక వాహనాలపై వెళ్లే వారు ప్రమాదాల బారిన పడుతున్నారంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.



అంధకారంలో ఉన్న అడ్లూర్ రోడ్డు



కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన దారిలో చీకట్లు

క్లుప్తంగా

ముగిసిన ఉషా క్రీడలు



బాల్కొండ: క్రీడల్లో గెలుపోటములు సహజమని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ముప్కాల్ మండల కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉష పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ముప్కాల్ మండల కేంద్రం క్రీడలకు పుట్టినిల్లు అన్నారు. గ్రామంలో దాతల సహకారంతో ఇండోర్ స్టేడియం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, వీడీసీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఈశా ఫౌండేషన్ క్రీడలు



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. మ్యాచ్‌లో కమ్మర్‌పల్లి జట్టు మొదటి స్థానంలో నిలవగా రెండో స్థానంలో కొండాపూర్ జట్టు నిలిచింది. అనంతరం ఫౌండేషన్ ప్రతినిధులు విజేత జట్లకు బహుమతులు అందజేశారు. ప్రతినిధులు, వలంటీర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ విద్యార్థులకు బంగారు, రజత పతకాలు



మోర్తాడ్: ముప్కాల్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఉషా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ విద్యార్థులకు బంగారు, రజత పతకాలు లభించాయి. పీఈటీ సింధూజ శిక్షణలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న 45 కేజీల కేటగిరిలో మనోజ్ఞ బంగారు పతకం, 42 కిలోల కేటగిరిలో అక్షిత రజత పతకం, 52 కిలోల కేటగిరిలో నవ్య బంగారు పతకాలను అందుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి బంగారు, రజత పతకాలను అందించి అభినందించారు. తమ గ్రామ విద్యార్థులు మంచి ప్రతిభ చూపడం ఎంతో సంతోషంగా ఉందని తిమ్మాపూర్ గ్రామ, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

విదేశీ రోడ్లపై మనోళ్లు రయ్.. రయ్..

- ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం ఇతర దేశాలకు యువత
- చదువు, ఉద్యోగంతో పాటు పార్ట్‌టైం డ్రైవింగ్ చేస్తూ సంపాదన
- జిల్లాలో ఏటా పెరుగుతున్న ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్లు
- జిల్లాలో ఈ ఏడాది మార్చి నాటికి 1410 మందికి లైసెన్సుల జారీ

విదేశీ రోడ్లపై మనోళ్లు డ్రైవింగ్‌లో రయ్.. రయ్‌మంటూ దూసుకెళ్తున్నారు. చదువు, ఉద్యోగం, పర్యాటకం పేరుతో చాలా మంది విదేశాలకు వెళ్తుంటారు. అక్కడ వాహనం నడపాలంటే కచ్చితంగా ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ (ఐడీపీ) ఉండాలి. విదేశాలకు వెళ్లే వారంతా ఐడీపీ లైసెన్స్‌లు పొందడానికి ఆసక్తి చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ లైసెన్స్‌లు తీసుకునే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.



ఖలీల్‌వాడి: విదేశాల్లో ఎటు వెళ్లాలన్నా కారు తప్పనిసరి. ఉద్యోగ నిమిత్తం, ఎంఎస్, ఎంబీఏ, ఎంబీబీఎస్ వంటి ఉన్నత చదువులకు వెళ్లేవారు వేలాది మంది ఉంటారు. ఆయా దేశాలను బట్టి వారానికి రెండు నుంచి మూడు రోజులే కళాశాలలు, ఆఫీస్‌లు ఉండటంతో మిగతా రోజులు పార్ట్‌టైంగా డ్రైవింగ్ చేస్తూ ఉపాధి పొందుతారు. దీనికి గాను రూ.50 వేల నుంచి రూ. లక్షల్లో సంపాదిస్తున్నారు. దీంతో ఐదేళ్లుగా ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునే వారి సంఖ్య జిల్లాలో పెరుగుతోంది.

ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ పొందడమెలా..

ఆర్టీఏ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత పూర్తి చేసిన ఫారాలను కార్యాలయంలో సమర్పించాలి. ఫారం-4ఏ తోపాటు డ్రైవింగ్ లైసెన్స్, హెల్త్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను జత చేస్తూ డ్రైవింగ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలి. వీటిని పరిశీలించిన ఆర్టీఏ అధికారులు స్పీడ్ పోస్టు ద్వారా ఇంటికి ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ (ఐడీపీ) కార్డును పంపిస్తారు.

డ్రైవింగ్ టెస్టులో అధికారులు పక్కనే..

దుబాయి, ఇతర దేశాల్లో డ్రైవింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. కారు డ్రైవింగ్ చేసేటప్పుడు అధికారులు పక్కనే కూర్చుంటారు. మనకు డ్రైవింగ్ స్టీరింగ్ కుడి వైపు ఉంటే విదేశాల్లో ఎడమవైపు ఉంటుంది. గల్ఫ్ వంటి దేశాల్లో ఎక్కువ మంది డ్రైవర్లుగా ఉపాధి పొందుతున్నారు.

విదేశాల్లో ఉపాధి పొందొచ్చు

ఇక్కడి లైసెన్స్‌తో ఇతర దేశాల్లో లర్నింగ్‌గా ఉపయోగించుకోవచ్చు. విదేశాల్లో స్థిరపడిన వ్యక్తులు డ్రైవింగ్ ద్వారా ఉపాధి పొందాలనుకుంటే ఇక్కడి ఇంటన్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్‌ను చూయిస్తే అక్కడ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోడానికి అవకాశం ఉంటుంది. లైసెన్స్ ఉన్నవారికి ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. – ఉమామహేశ్వర్‌రావు, జిల్లా రవాణాశాఖ అధికారి

అక్కడి లైసెన్స్ పొందాలి..

మనదేశంలో తీసుకున్న ఐడీపీతో దాదాపు 150 దేశాల్లో వాహనాలు నడపవచ్చు. ఇక్కడి ఐడీపీతో విదేశాలకు వెళ్లిన తర్వాత యూరోపియన్, ఆయా దేశాలను బట్టి ఆరు నెలల నుంచి సంవత్సరం పాటు ఐడీపీ చెల్లుబాటు అవుతుంది. తర్వాత డ్రైవింగ్ చేయాలనుకునే వారు అక్కడి నిబంధనల ప్రకారం లైసెన్స్ పొందాలి. మనదేశంలో లైసెన్స్ పొంది 3, 4 ఏళ్ల అనుభవం ఉన్న వారికి విదేశాల్లో లైసెన్స్ త్వరగా వస్తుందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునేవారి సంఖ్య పెరుగుతోంది. 2023లో 1,264 మంది, 2024 మార్చి 31 నాటికి 1410 మంది లైసెన్స్ తీసుకున్నట్లు రవాణాశాఖ తెలుపుతోంది.

ఎస్సై, ఏఎస్సైపై లోకాయుక్తలో ఫిర్యాదు

ఖలీల్‌వాడి: వినాయక నిమజ్జనంలో జరిగిన గొడవలో సంబంధం లేకున్నా తనపై అక్రమంగా కేసు నమోదు చేసి దాడి చేసిన ఎస్సై, ఏఎస్సైపై లోకాయుక్తలో ఈ నెల 11న ఫిర్యాదు చేసినట్లు బాధితుడు అదల్‌దివిటీ నరేశ్ 'సాక్షి'కి ఆదివారం తెలిపారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 18న ఉదయం 3:45 గంటలకు కోటగల్లీకి చెందిన మిత్రుడితో కలిసి అదే ప్రాంతానికి బైక్‌పై వెళ్తుండగా గోల్‌హనుమాన్ ప్రాంతంలో ఓ వ్యక్తిని పది మంది పోలీసులు తీసుకెళ్తున్నారు. ఏమైంది, ఎందుకు అలా తీసుకెళ్తున్నారని ఎస్సై యాసిన్ అరాఫత్‌ను అడిగే సందర్భంలో ఓ పోలీస్ అధికారి తనను అకారణంగా కొట్టి బూతులు తిట్టాడని చెప్పారు. దీంతో దాడి చేసిన పోలీసు అధికారిపై సేకరించిన సీసీటీవీ పుటేజీల ఆధారంగా డీఐజీ, సీపీ, టూటౌన్ ఎస్సైకి పోస్టులో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు వెళ్లగానే వినాయక నిమజ్జనంలో జరిగిన గొడవలో 21 మందిపై కేసు నమోదైంది. అందులో సంబంధం లేని తనపై కూడా కేసు నమోదు చేసి ఏ2గా చేర్చినట్లు పేర్కొన్నారు. పోస్టులో ఫిర్యాదు వెళ్లడంతో ఎస్బీ కానిస్టేబుల్ సురేశ్ వాట్సాప్ ఫోన్ చేసి బూతులు తిట్టారని, వాటికి సంబంధించిన ఆడియో, వాట్సాప్ కాల్ వివరాలను లోకయుక్త ఫిర్యాదులో అందించినట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత తనను పీఏస్‌కు పిలిపించి సెల్‌ఫోన్ నుంచి నా వ్యక్తిగత సమాచారంతో పాటు ఆధార్‌కార్డు తీసుకుని ఆరు సంతకాలను బలవంతంగా తీసుకున్నారని చెప్పారు. పోలీసులు కావాలనే గతంలో ఉన్న పాత కేసులను దృష్టిలో ఉంచుకొని తనపై అక్రమ కేసులు పెడుతున్నారని బాధితుడు పేర్కొన్నాడు.

ఆధారాలు ఉన్నాయి

కేసుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయి. దాని ప్రకారమే నరేశ్‌పై కేసు నమోదు చేశాం. గతంలో కూడా అతనిపై టూటౌన్‌లో కేసులు ఉన్నాయి. పై అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. – యాసిన్ అరాఫత్, ఎస్సై

'కుల గణనకు మోదీ వ్యతిరేకం'

- తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్



మాట్లాడుతున్న ఈరవత్రి అనిల్

నిజామాబాద్ నాగారం: కుల గణనను మోదీ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. నగరంలోని కోటగల్లిలో పద్మశాలి కల్యాణ మండపం పునః ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీసీలు తిరగబడతారనే భయంతో మోదీ కులగణనను అడ్డుకుంటున్నారని ఆరోపించరాడు. 50 శాతం పైగా ఉన్న బీసీలకు 27 శాతమే రిజర్వేషన్లు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మశాలీల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నుడా చైర్మన్ కేశ వేణు, నరాల రత్నాకర్, పద్మశాలి సంఘం నగర అధ్యక్షుడు గుజ్జేటి వెంకట్ నర్సయ్య, అవదూత దశరథం, గంట్యాల వెంకట్ నర్సయ్య, బింగి మోహన్, దాసరి గుండయ్య, దీకొండ యాదగిరి, బిజ్జు దత్తాద్రి, పుల్గం హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రూప్-3 పరీక్ష

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మొదటి రోజైన ఆదివారం గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షా కేంద్రాల ఎదుట అభ్యర్థులను తనిఖీ చేసి అధికారులు లోనికి అనుమతించారు. అభ్యర్థుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాలను సంబంధిత అధికారులు తనిఖీ చేశారు. - సాక్షి నెట్‌వర్క్



కామారెడ్డి: ఎస్ఆర్‌కే జూనియర్ కళాశాలలో..



కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ..



ఆర్‌కే డిగ్రీ కళాశాల సెంటర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో..



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రంలో



పిల్లలకు 'పరీక్షే'

నిజామాబాద్‌లో గ్రూప్-3 పరీక్ష కోసం తల్లులు తమ చంటి పిల్లలతో ఆదివారం కేంద్రాలకు హాజరయ్యారు. వారు పరీక్షకు వెళ్లగా అమ్మమ్మ, నానమ్మలు, తండ్రులు, బంధువులు పిల్లలను ఇలా ఆడిస్తూ, పడుకోబెడుతూ కనిపించిన దృశ్యాలు.. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్






● సండే సందడి

రెంజల్: రెంజల్‌లోని రెవెన్యూ కార్యాలయం చుట్టూ సండే సందడి కనిపించింది. కార్యాలయానికి చుట్టు పక్కల కేజీబీవీ, మైనార్టీ గురుకుల పాఠశాల, ఆదర్శ కళాశాల హాస్టళ్లు ఉన్నాయి. పాఠశాల, కళాశాలల్లో బాలికల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఇంటి నుంచి వంటలు చేసుకుని వచ్చి విద్యాలయాల ఆవరణల్లో వారి పిల్లలతో సరదాగా గడిపారు. పిల్లలకు కావాల్సిన వస్తువులను అందించారు.



రెంజల్‌లోని మైనారిటీ గురుకుల పాఠశాల ఆవరణలో..

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

నవీపేట: అప్పుల బాధతో కుటుంబ పోషణ భారం కావడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నవీపేట మండలంలోని మోకన్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై వినయ్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన టెక్ కర్ణ(35) గతంలో ఉపాధి నిమిత్తం అప్పు చేసి దుబాయికి వెళ్లాడు. అక్కడ పని సరిగా లేకపోవడంతో స్వగ్రామానికి వచ్చాడు. ఫైనాన్స్‌పై ప్యాసింజర్ ఆటోను కొనుగోలు చేశాడు. అయినా అప్పుల బాధ తీరలేదు. కుటుంబ పోషణ భారం కావడంతో ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరి అదృశ్యం

నవీపేట: బోధన్ మండలంలోని పెంటకుర్దు గ్రామానికి చెందిన ఆలకుంట చిన్న ఎల్లయ్య అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం జన్నెపల్లిలోని సోదరి మక్కల గంగామణి ఇంటికి ఇచ్చిన డబ్బుల కోసం వెళ్లాడు. బాకీ డబ్బులు ఇవ్వాలని సోదరికి కోరగా వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత ఇంటికి వెళ్తానని చెప్పి ఎల్లయ్య ఇంటికి చేరుకోలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేపు హ్యాండ్‌బాల్ బాలికల జట్టు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సబ్ జూనియర్ గర్ల్స్ హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికను ఈ నెల 19న జెడ్పీహెచ్ఎస్ కల్లెడి స్కూల్‌లో నిర్వహించనున్నట్లు నిజామాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగమోహన్, సురేందర్ ఆదివారం పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి జూనియర్ గర్ల్స్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని అన్నారు. పోటీల్లో పాల్గొనే వారు 1.1.2005 నుంచి 31.12.2008 మధ్యలో జన్మించిన వారై ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 9642535535, 9440441757 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



వర్ని: మోస్రా మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పెద్దిగారి శోభన్(41) గ్రామ మైలారం చెరువు కుంటలో పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు వర్ని ఎస్సై రమేశ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శోభన్ చింతకుంట గ్రామంలోని నలంద స్కూల్‌లో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం చెరువులో మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



వర్ని: మండలంలోని జలాల్పూర్ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సైదిపూర్ గ్రామానికి చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. బైక్‌పై జలాల్పూర్ నుంచి వర్నికి వస్తుండగా మెగావత్ గబ్బర్ సింగ్, కాట్రోత్ సంతోష్‌కు ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్నది. ఈ ఘటనలో వీరిద్దరికి కాళ్లు, చేతులు విరిగాయి. క్షతగాత్రులను స్థానికులు అంబులెన్స్‌లో నిజామాబాద్‌కు తరలించారు.

ఇసుక వాహనాలు పట్టివేత



బిచ్కుంద: మండలంలోని ఖద్గాం మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను ఎస్సై మోహన్‌రెడ్డి ఆదివారం పట్టుకున్నారు. ఖద్గాంలో అనుమతి లేకుండా రెండు వాహనాలు ఇసుకను అక్రమంగా తీసుకెళ్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



రెంజల్: పురుగుల మందు సేవించి ఒకరు అస్వస్థతకు గురవడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు, 108కు సమాచారం అందించారు. రెంజల్ శివారులో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి పురుగుల మందు సేవించి రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు, 108కు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తిని వారు వెంటనే 108లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

పిచ్చి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో పిచ్చి కుక్కలు దాడి చేయడంతో ఓబాలుడికి గాయాలయ్యాయి. సంపంగి నాగరాజు కుమారుడు నాగసుశాంత్ ఆదివారం ఉదయం ఇంటి వద్ద ఆడుకుంటుండగా పిచ్చి కుక్కలు దాడి చేశాయి. దీంతో నాగసుశాంత్‌కు ముఖంపై తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ తీగలు తగిలి డీసీఎం దగ్ధం



దగ్ధమవుతున్న డీసీఎం వ్యాను



కారుకు నిప్పంటుకున్న దృశ్యం

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లిలో వేంపల్లి లిప్ట్ కాలువ వెంబడి ఉన్న రోడ్డు గుండా ప్రయాణిస్తున్న డీసీఎం వ్యాన్ విద్యుత్‌షాక్‌తో పూర్తిగా దగ్ధమైంది. ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ నుంచి ఏర్గట్ల మండలం తడ్‌పాకల్ గ్రామానికి ధాన్యం తీసుకొచ్చేందుకు వెళ్తున్న డీసీఎం వ్యాన్ కొత్తపల్లికి రాగానే విద్యుత్ తీగలు కిందకు ఉండటంతో వాటికి తగిలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో వ్యాన్ పూర్తిగా దగ్ధమైంది. బాల్కొండ ఫైర్ ఇంజిన్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. అందులో ఉన్న డ్రైవర్‌కు గాయాలు కావడంతో స్థానికులు చికిత్స కోసం ఆర్మూర్‌లోని ఆస్పత్రికి తరలించారు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని గ్రామస్తులు ఆరోపించారు.

కారులో చెలరేగిన మంటలు

కామారెడ్డి క్రైం: పార్కింగ్ చేసి ఉంచిన ఓ కారులో మంటలు చెలరేగిన ఘటన జిల్లా కేంద్రంలోని స్నేహపురి కాలనీలో ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లో నివాసం ఉండే ఓ కుటుంబం శుభకార్యానికి హాజరయ్యేందుకు బంధువుల ఇంటికని కారులో వచ్చారు. కారును ఇంటి ఎదుట రోడ్డు పక్కన పార్క్ చేశారు. కొద్ది సేపటికే కారులో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక శకటం వచ్చి మంటలు ఆర్పింది. కారును పార్క్ చేసిన చోట చెత్తకు నిప్పంటుకోవడంతో పెట్రోల్ ట్యాంక్ వరకు విస్తరించడంతో ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

కోటార్మూర్‌లో చోరీ



ఇంటిని పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌వో

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో శనివారం అర్ధరాత్రి దుండగులు సయ్యద్ మొయినుద్దీన్ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయనగౌడ్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. సయ్యద్‌మొయినుద్దీన్ తన భార్యకు అనారోగ్యం కారణంగా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా సయ్యద్ కుమార్తె ఇంట్లో పక్క బెడ్‌రూంలో పడుకొని ఉంది. దుండగులు వెనుక గది గడియ పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఉదయం లేచి చూసేసరికి పక్కరూంలో ఉన్న బీరువా, సామాగ్రి చిందరవందరంగా ఉండడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌హెచ్‌వో సత్యనారాయనగౌడ్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. సుమారు 12 తులాల బంగారం, 30 తులాల వెండితోపాటు రూ.30వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

బస్సు ఢీకొని మాజీ ఉపసర్పంచ్ మృతి



నర్సింగరావు (ఫైల్)

మాచారెడ్డి: ఆర్టీసీ బస్సు ఢీ కొని మండలంలోని చుక్కాపూర్ మాజీ ఉప సర్పంచ్ ఓడపల్లి నర్సింగరావు(55) మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం మాచారెడ్డి బస్టాండ్ సమీపంలో కామారెడ్డి–సిరిసిల్ల రహదారిపై చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు నర్సింగరావు తన కూతురితో కలిసి బైక్ పై చుక్కాపూర్ నుంచి మాచారెడ్డి వైపు వస్తుండగా కరీంనగర్ నుంచి వస్తున్న కామారెడ్డికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొన్నది. ఈ ఘటనలో ఆయన కూతురు ఎగిరి కొద్ది దూరంలో పడగా స్వల్ప గాయాలయ్యాయి. నర్సింగరావు తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు కామారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. నర్సింగరావు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

వరికొయ్యలను కాల్చొద్దు

- జిల్లా వ్యవసాయాధికారి సూచన



డొంకేశ్వర్: వరి కోతల తర్వాత పొలాల్లో ఏర్పడిన కొయ్యలు, అవశేషాలను కాల్చకూడదని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ రైతులకు సూచించారు. వరి కొయ్యలను కాల్చితే జరిగే నష్టాలను వివరిస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివరాలిలా ఉన్నాయి.

- నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు ఆవిరైపోతాయి. తద్వారా పోషకాలు తర్వాత వేసే పంటలకు అందుబాటులో ఉండవు.
- నిప్పు పెట్టడం వలన నైట్రస్ ఆక్సైడ్, కార్బండయాక్సైడ్ వాతావరణంలో కలిసిపోయి గ్లోబల్ వార్మింగ్‌కు కారణమవుతుంది. వాయు కాలుష్యం ఏర్పడి ఊపిరితిత్తుల సమస్యలకు దారితీస్తుంది.
- కాలిపోకుండా మిగిలి ఉన్న అవశేషాలపై కీటకాలు, తెగుళ్లకు నివాసాలుగా మారుతాయి. మట్టిలోని సూక్ష్మజీవులు దెబ్బతిని భూమి సంతులనం కోల్పోతుంది. మట్టిలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గి భవిష్యత్ పంటలకు ఎక్కువ నీటి అవసరం ఏర్పడుతుంది.
- హెక్టారు భూమిలోని వరి కొయ్యలు, వేరు దుబ్బులు తగలబెడితే సుమారు రూ.4వేలు విలువ గల నత్రజని, భాస్వరం, పొటాషియం, గంధకం, సేంద్రియ కర్బనం లాంటి అనేక సూక్ష్మ పోషకాలు నేరుగా నష్టపోవడం జరుగుతుంది.
- రైతులు ఈ నష్టాలను దృష్టిలో ఉంచుకొని వరి కొయ్యలు, వ్యర్థాలు కాల్చకుండా భూమి ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని డీఏవో కోరారు.

ఉద్యోగంలోకి తీసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: ఉపాధ్యాయ ఉద్యోగం నుంచి తొలగించిన లావణ్యను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఐక్యకార్యాచరణ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ధర్పల్లి మండలం దుబ్బాక వడ్డెర కాలనీ ప్రైమరీ స్కూల్‌లో ఇటీవల ఉట్నూరు లావణ్య ఎస్జీటీగా నియమితులయ్యారు. నెల రోజులు ఉద్యోగం చేసిన తర్వాత నియామకం అక్రమమైనదని అధికారులు ఆమెను ఉద్యోగం నుంచి ఆమె స్థానంలో భార్గవి అనే మహిళను ఎంపిక చేశారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు.

రాజ్యాధికారమే బీసీల అంతిమ లక్ష్యం

- అందుకోసం అవసరమైతే మిలిటెంట్ పోరాటం: ఆర్.కృష్ణయ్య



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, వి.హనుమంతరావు తదితరులు

కాచిగూడ: రాజ్యాధికార సాధనే బీసీల అంతిమ లక్ష్యమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆ లక్ష్య సాధన కోసం బీసీలంతా సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అవసరమైతే మిలిటెంట్ పోరాటాలకు కూడా సిద్ధంగా ఉండాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఆదివారం కాచిగూడ అభినంద్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్ కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ నెల 25వ తేదీన రవీంద్రభారతిలో నిర్వహించే 'బీసీల సమరభేరి' పోస్టర్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో పూర్తిస్థాయి వాటా దక్కలేదని ఆవేదన వ్యక్తంచేశారు. జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలని, బీసీల జనాభాకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ సవరణ చేసి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల సమరభేరి కార్యక్రమానికి పార్టీలకతీతంగా బీసీలంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తంగెళ్లముడి నందగోపాల్, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, ఉదయ్ నేత, మట్టా జయంతి గౌడ్, సుధాకర్, ర్యాగ రమేష్, రఘుపతి, పరశురామ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం వరికి బోనస్: కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సన్న ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నామని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి చెప్పారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సన్నాలకు బోనస్ ఇవ్వడం గొప్ప నిర్ణయమన్నారు. రుణమాఫీ, బోనస్‌ల కింద ప్రభుత్వం ఇచ్చిన డబ్బులను రైతులు పెట్టుబడి కింద ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

మీ సేవ: దర్జాగా సర్టిఫికెట్ల దందా

- చాలాచోట్ల తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో మీ సేవ కేంద్రాల నిర్వాహకులు కుమ్మక్కు
- జేఈఈ మెయిన్‌కు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం తల్లిదండ్రుల అగచాట్లు
- సర్టిఫికెట్‌కు ఇంత అని చెబుతూ వసూళ్లు చేస్తున్నట్లుగా ఆరోపణలు
- సాధారణ రోజుల్లోనూ ఇదే పరిస్థితి అనే ఫిర్యాదులు
- డబ్బులు ఇవ్వకుంటే రోజుల తరబడి పెండింగ్‌లో దరఖాస్తులు

రూ.45 సర్వీసు చార్జీకి రూ.500 నుంచి రూ.4,000 వరకు వసూళ్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాజధాని హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా పలు మీ సేవ కేంద్రాల్లో సర్టిఫికెట్ల దందా కొనసాగుతోంది. సర్వీసు చార్జీల కింద రూ.45 తీసుకోవాల్సి ఉండగా సర్టిఫికెట్‌కు రూ.4,000 వరకు వసూలు చేస్తున్నారు. ఎన్ఐటీలు, ఐఐటీలు, జీఎఫ్‌టీఐలలో ప్రవేశాల కోసం ముందుగా నిర్వహించే జేఈఈ మెయిన్‌కు అవసరమైన సర్టిఫికెట్ల కోసం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివే పిల్లల తల్లిదండ్రులు మీ సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని కేంద్రాల నిర్వాహకులు భారీ దందాకు తెరలేపారు. తల్లిదండ్రులకు అవసరం కాబట్టి ప్రాంతాన్ని బట్టి ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.500 నుంచి రూ.1,000 వరకు, కొన్నిచోట్ల రూ.4,000 వరకు కూడా వసూలు చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో కొంతమంది సిబ్బంది, అటెండర్లతో కుమ్మక్కై ఈ దందా కొనసాగిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జేఈఈ మెయిన్ అని కాకుండా సాధారణ రోజుల్లో సైతం తహశీల్దార్ కార్యాలయాల్లో డబ్బులు తీసుకుని కుల, ఆదాయ తదితర ధ్రువపత్రాలు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ముట్టకపోతే దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచేస్తున్నారని, కొంతకాలం తర్వాత ఏదో ఒక కారణంతో దరఖాస్తును తిరస్కరిస్తున్నారనే ఫిర్యాదులుండటం గమనార్హం.

పౌరసేవకు ఎగనామం

దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకే సర్టిఫికెట్ల జారీని ప్రభుత్వం పౌరసేవల పరిధిలోకి తెచ్చింది. నామమాత్రపు రుసుంతో సర్టిఫికెట్లు జారీ చేసే విధానం ప్రారంభించింది. అయితే దీనిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు తహసీల్ కార్యాలయాల సిబ్బంది, మీ సేవ నిర్వాహకులు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. రూ.45 సర్వీసు చార్జీ ఉండే ఓబీసీ సర్టిఫికెట్ కావాలంటే పట్టణ ప్రాంతాల్లోని పలుచోట్ల రూ.4,000 వరకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,000 వరకు చెల్లించాల్సిందేనని తెగేసి చెబుతున్నారు. తామే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, ఆ పత్రాలను తహసీల్దార్ కార్యాలయానికి పంపించి, ఆమోదించేలా చూస్తామని చెప్పి వసూళ్లు చేపడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

70 వేల మంది తల్లిదండ్రులపై ప్రభావం

అక్టోబర్ 28వ తేదీన జేఈఈ మెయిన్ నోటిఫికేషన్ జారీ అయింది. అదేరోజు నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నెల 22వ తేదీతో గడువు ముగియనుంది. కాగా ఏదైనా రిజర్వేషన్ వర్తించాలంటే సంబంధిత సర్టిఫికెట్లు కావాల్సిందే. ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 95 వేల మంది హాజరు కానుండగా, అందులో దాదాపు 70 వేలమందికి ఈ సర్టిఫికెట్లు అవసరమని అంచనా. దీనిని అసరాగా చేసుకొని మీసేవ కేంద్రాల నిర్వాహకులు, తహసీల్ కార్యాలయాల సిబ్బంది దందాకు తెరతీశారు.

సొమ్ము దండుకున్నా దబాయింపులే

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన శ్రీనివాస్‌కు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తన కుమారుడి కోసం (జేఈఈ మెయిన్‌కు దరఖాస్తు చేసేందుకు) ఓబీసీ సర్టిఫికెట్ అవసరమైంది. దరఖాస్తు చేద్దామని స్థానిక మీ సేవా కేంద్రానికి వెళ్లారు. అక్కడి నిర్వాహకుడు.. 'మేమే దరఖాస్తు చేస్తాం.. దరఖాస్తు ఫారాన్ని మేమే తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్చి ఆన్‌లైన్‌లో ఆమోదం పొందేలా చేస్తాం.. అందుకు రూ.1,000 ఖర్చు అవుతుంది' అని చెప్పాడు. రూ.45 దరఖాస్తుకు అంత చెల్లించాలా? అని శ్రీనివాస్.. బాలానగర్‌లోని మరో మీ సేవ కేంద్రానికి వెళ్లి అడగ్గా అక్కడా ఇదే సమాధానం ఎదురైంది. గత్యంతరం లేక రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేశాడు. 12 రోజులు గడిచినా దరఖాస్తును కార్యాలయ సిబ్బంది కనీసం ఓపెన్ కూడా చేయలేదు. మీ సేవ కేంద్రం నిర్వాహకుడిని అడిగితే 'అవుతుందిలే.. చేస్తాం.. తహసీల్దార్ కార్యాలయంలో చేయించే వ్యక్తి బిజీగా ఉన్నాడు..' అంటూ నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు. దీంతో శ్రీనివాస్ నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ కిషోర్ అనే వ్యక్తిని కలిశారు. అతను 'మీరు నేరుగా ఎలా వస్తారు..' అంటూ మండిపడ్డాడు. దీంతో శ్రీనివాస్ అక్కడ ఉన్న ఇతర సిబ్బందిని సంప్రదించారు. అంతా కుమ్మక్కే కావడంతో.. 'మీ దరఖాస్తు ఫారమే లేదు. మీరివ్వలేదు..' అంటూ వాళ్లు బుకాయించారు. రెండురోజులు తిరిగి విసిగిపోయిన శ్రీనివాస్ చివరకు తహసీల్దార్‌ను కలిసి పరిస్థితి వివరించాడు. ఆన్‌లైన్ ఫారం ప్రింట్ తీసి ఫైల్ సిద్ధం చేయాలని తహసీల్దార్ కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు. అయినా వారు పలు కొర్రీలు పెట్టారు. దీంతో శ్రీనివాస్ మళ్లీ తహసీల్దార్‌ను కలవడంతో ఎట్టకేలకు సర్టిఫికెట్ జారీ అయ్యింది.

అబద్ధాల పోటీ పెడితే.. మోదీదే మొదటి స్థానం

- మహారాష్ట్ర ఎన్నికల ప్రచార సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు
- కేంద్రం బీజేపీయేతర ప్రభుత్వాలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తోంది
- తెలంగాణలో రుణమాఫీ కింద రూ.18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహారాష్ట్రలోనూ రూ.3లక్షలు రుణమాఫీ చేస్తామని హామీ



ఆదివారం మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

నయాగామ్, భోకర్, సోలాపూర్: అబద్ధాల పోటీలు పెడితే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశంలోనే మొదటి స్థానంలో నిలుస్తారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఛత్రపతి శివాజీ, జ్యోతిబా పూలే, బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయులు, బాలాసాహెబ్ ఠాక్రే , శరద్ పవార్ వంటి యోధులు జన్మించిన మహారాష్ట్ర నేలలో ఇప్పుడు విద్రోహులు రాజ్యమేలుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నయాగామ్, భోకర్, నాందేడ్‌లలో జరిగిన ప్రచార సభల్లో ప్రసంగించారు. సోలాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. నయాగామ్‌లో మీనాల్ పాటిల్ ఖత్‌గావ్‌కర్.. భోకర్‌లో తిరుపతి కదమ్ కొండేకర్.. దక్షిణ సోలాపూర్‌లో చేతన్ నరోటే, నాందేడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో రవీంద్ర చౌహాన్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

వీరుల నేలలో విద్రోహులు

ఆటో డ్రైవర్‌గా ఉన్న ఏక్‌నాథ్ శిందేను బాలాసాహెబ్ కుటుంబం మంత్రిని చేసిందని.. శరద్‌పవార్ కూడా సొంత కుమార్తెను కాదని అజిత్ పవార్‌ను ఉప ముఖ్యమంత్రి చేశారని సీఎం రేవంత్ చెప్పారు. అశోక్ చవాన్, ఆయన తండ్రి శంకర్‌రావు చవాన్‌లను కాంగ్రెస్ పార్టీ సీఎంలను చేసిందని పేర్కొన్నారు. కానీ ఈ ముగ్గురు విద్రోహులుగా మారి వీరుల నేలను అవమానాల పాలు చేశారని విమర్శించారు.

తెలంగాణలో 'సంక్షేమం'పై వాస్తవాల పరిశీలనకు సిద్ధం

తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతు ఆత్మహత్యలు అధికంగా జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వాటికి అడ్డుకట్ట పడిందని రేవంత్ చెప్పారు. తమ ప్రభుత్వం 50రోజుల్లోనే రూ.18 వేల కోట్ల రుణమాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లో వేసిందన్నారు. దేశంలోనే అత్యధికంగా రైతుల ఆత్మహత్యలు మహారాష్ట్రలో జరుగుతున్నాయని.. ఆ ఆత్మహత్యలను నిలువరించాలన్నా, రాష్ట్ర అభివృద్ధి జరగాలన్నా కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ)ల మహా వికాస్ అఘాడీ కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కూటమి అధికారంలోకి రాగానే రూ.3 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను ఆదుకుంటామన్నారు. తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో ఉద్యోగ నియామకాలు, రుణమాఫీ, ఇతర సంక్షేమ కార్యక్రమాలు వాస్తవమో, కాదో కేంద్ర మంత్రులనో, అధికారుల బృందాలనో పంపి తెల్చుకొమ్మని సవాల్ విసిరారు.



ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వినోద్‌కుమార్



తెలంగాణ సచివాలయం బాహుబలి మెయిన్ ఎంట్రెన్స్ గేట్లను తొలగించిన దృశ్యం

వయోజనుల్లో నిరక్షరాసులు ఎందరు?

- సర్వేకు శ్రీకారం చుట్టిన విద్యాశాఖ
- పాఠశాల విద్యార్థులతో గ్రామాలలోని నిరక్షరాసుల వివరాల సేకరణ

మోర్తాడ్(బాల్కొండ): వయోజనుల్లో నిరక్షరాసులు ఎవరెవరు ఉన్నారు అనే వివరాలను నమోదు చేయడానికి విద్యాశాఖ, వయోజన విద్యా విభాగం సంయుక్తంగా సర్వేకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే అంతటా సమగ్ర సర్వే కొనసాగుతున్న నేపథ్యంలో ఉద్యోగులతో నిరక్షరాసులను గుర్తించడానికి ప్రత్యేక సర్వే నిర్వహించే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఉన్నత పాఠశాలల్లోని ఏడు, ఎనిమిది, తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులతో వయోజనుల్లో నిరక్షరాసులైన వారిని గుర్తించడానికి సన్నాహాలు చేస్తున్నారు. బుధవారం అన్ని పాఠశాలలకు విద్యాశాఖ నిరక్షరాసుల గుర్తింపు వివరాల నమోదు కోసం ఫారాలను అందజేసింది. ఇప్పటికే ఆయా మండల విద్యాశాఖ కార్యాలయాల్లో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి నిరక్షరాసులను విద్యార్థుల ద్వారా గుర్తించాలని నిర్దేశించారు. గతంలో సేకరించిన లెక్కల ప్రకారం జిల్లాలో 1.35లక్షల మంది నిరక్షరాసులు ఉన్నారు. త్వరలో ప్రారంభించనున్న నవ భారత్ అక్షరాస్యత కార్యక్రమంలో తొలి విడతలో 39,390 మందిని అక్షరాసులుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏడు, ఎనిమిది, తొమ్మిది చదువుతున్న విద్యార్థులు ఇంటి వద్ద హోం వర్క్ చేస్తూనే తమ పరిసరాల్లోని నిరక్షరాసులకు అక్షరా లు నేర్పించాల్సి ఉంది.

సాక్షర భారత్ కార్యక్రమం తర్వాత

సంపూర్ణ అక్షరాస్యత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేసినా అక్షరాస్యత సాధించడంలో వంద శాతం ఫలితాలు లభించలేదు. 2018 వరకు సాక్షర భారత్ కార్యక్రమాన్ని కొనసాగించా రు. కేంద్రం నిధులు ఇవ్వగా రాష్ట్ర ప్రభుత్వం సమన్వయం చేసి అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించారు. అప్పట్లో సాక్షర భారత్ కార్యక్రమం కోసం గ్రామానికి ఇద్దరు కో–ఆర్డినేటర్లు, వారిని అజమాయిషీ చేయడానికి మండల కో–ఆర్డినేటర్ ఒకరు విధులు నిర్వహించారు. సాక్షర భారత్ కార్యక్రమాన్ని నిలిపివేసిన 6 సంవత్సరాల తరువాత మరోసారి అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించనుండటం గమనర్హం.

ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చాం..

గ్రామాలలో నిరక్షరాసులైన వారిని గుర్తించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చాం. వారు తమ విద్యార్థులతో ఈ సర్వేను పూర్తి చేయించాల్సి ఉంది. సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాల్సిందే.

– అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి

సంపూర్ణ అక్షరాస్యత కోసం..

సంపూర్ణ అక్షరాస్యత సాధించడానికి నవ భారత్ అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. గతంలోనే నిరక్షరాసుల సర్వే జరిగినా మరోసారి వివరాలను సేకరించడానికి విద్యాశాఖ సేవలు తీసుకుంటున్నాం.

– గోవిందరావు, డిప్యూటీ డైరెక్టర్, వయోజన విద్యా విభాగం

దూది రైతు దుఃఖం

- భారీ వర్షాలతో పంటకు నష్టం
- తగ్గిన దిగుబడితో రైతుల దిగాలు



పెద్దకొడప్‌గల్ శివారులో ట్రాక్టర్ సహాయంతో పత్తి పంటను తొలగిస్తున్న రైతు



మద్నూర్ శివారులో పత్తి తెంపుతున్న రైతులు

పెద్దకొడప్‌గల్/మద్నూర్(జుక్కల్): రైతులకు సిరులు కురిపించే తెల్లబంగారం దిగుబడి తగ్గింది. మార్కెట్‌లో పత్తికి డిమాండ్ ఉన్నా వర్షాల కారణంగా ఆశించిన మేర పంట చేతికి రాలేదు. జిల్లాలో ఈ సారి 33,657 ఎకరాల్లో పత్తి పంట సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎకరానికి పది నుంచి పన్నెండు క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఐదు నుంచి ఏడు క్వింటాళ్ల దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. భారీ వర్షాల కారణంగా పత్తి దిగుబడి తగ్గింది. మద్నూర్ మండల కేంద్రంలో పత్తి ఫ్యాక్టరీలు ఎక్కువగా ఉండడంతో చుట్టుపక్కల ప్రాంతాల రైతులు పత్తి పంటను సాగు చేస్తారు. కామారెడ్డి జిల్లాలో కేవలం మద్నూర్‌లోనే పత్తి ఫ్యాక్టరీలు ఉండడంతో ప్రభుత్వం ఇక్కడ సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసింది. అంతా బాగున్నా పత్తి పంట దిగుబడి తగ్గిపోవడంతో రైతులు పరేషాన్‌లో పడ్డారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా మూడు నాలుగేళ్లుగా రైతులు పత్తి సాగులో నష్టాలు చవిచూస్తున్నారు. దీంతో పాటు పెట్టుబడులు తడిసిమోపెడవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తికి మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా సరైన దిగుబడి లేదు.

ఈ తరుణంలో పత్తికి మద్దతు ధర రూ. 10 వేలకు పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో పత్తి పంటను మూడు సార్లు ఏరేవారు. ప్రస్తుతం ఒకే దశలో పూర్తవుతోంది. గతేడాదితో పోలిస్తే పెట్టుబడులు అధికమయ్యాయని, వర్షాల కారణంగా దిగుబడి తగ్గింద ని రైతులు వాపోయారు. పత్తి ఏరేందుకు కూలిరే ట్లు విపరీతంగా పెరిగాయని భూములు కౌలుకు ఇస్తేనే మేలని రైతులు ఆవేదన చెందుతున్నారు.

దిగుబడి తగ్గింది



ఈ సారి పత్తి పంట దిగుబడి పూర్తిగా తగ్గడంతో ఆర్థికంగా నష్టపోయాం. వర్షాలు కురిసి పత్తి రైతు నడ్డి విరిచింది. అంత వరకు బాగానే ఉన్నా పత్తి పంటకు వర్షాలు కురిసి పత్తి దెబ్బతింది. నేను ప్రతియేడు పత్తిని పండిస్తా. ఎకరాకు రూ.40 వేలు ఖర్చు చేశా. ఎకరాకు 10 క్వింటాళ్లు రావాల్సిన పత్తి దిగుబడి ఐదు క్వింటాళ్లకు పడిపోయింది.

– ఈరప్ప, రైతు, మద్నూర్

రైతులను ఆదుకోవాలి



ఈ సారి పత్తి పంట దెబ్బతీసింది. తెగుళ్లు, వర్షాలు పత్తి రైతులను దుఃఖంలో ముంచాయి. నేను రెండు ఎకరాల్లో పత్తి పంట వేశా. ఎకరాకు రూ.40 వేల వరకు ఖర్చు చేశాను. వాతావరణ పరిస్థితుల వల్ల పంట దిగుబడి తగ్గిపోయింది. ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకోవాలి. కేవలం ఐదు నుంచి ఆరు క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుబడి వచ్చింది.

– గుండప్ప, రైతు, మద్నూర్

ఎకరానికి 6 క్వింటాళ్లే..



ప్రభుత్వం రైతుబంధు డబ్బులు ఇవ్వకపోయినా.. అప్పులు చేసి మూడు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాను. ఎకరాకు రూ. 45 వేలు పెట్టుబడి పెట్టా. కాని ఎకరాకు 6 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చింది. పెట్టుబడి పెట్టిన డబ్బులు రాలేదు. రెండు సార్లు పత్తి తీస్తే పూర్తిగా పత్తి అయిపోయింది. అన్నదాతకు అప్పులే మిగులుతున్నాయి. ప్రభుత్వం రైతు బంధు డబ్బులన్నా ఇప్పించాలి.

– బేగరి దత్తు, రైతు, పెద్దకొడప్‌గల్

గొడ్డుపోతున్న ఆయిల్ పాం మొక్కలు

- ఆదరణ లేక ప్రభుత్వ నిధులు వృథా
- కాయలు కాయాల్సిన సమయంలో ఎండుతున్న వైనం



నిరాదరణకు గురవుతున్న బొప్పాస్‌పల్లి ఆయిల్ పాం మొక్కలు

నస్రుల్లాబాద్: ఆరుతడి పంటలను రైతులకు పరిచయం చేసేందుకు గత ప్రభుత్వం నస్రుల్లాబాద్ మండలం బొప్పాస్‌పల్లి సీడ్ ఫాం భూమిలో ఆయిల్ పాం మొక్కలను నాటించింది. కానీ వాటికి ఆదరణ కరువవడంతో గొడ్డుపోయి ఎందుకు పనికి రాకుండా అయ్యాయి. నిత్యం వాటికి సరిపడ నీరు, పోషకాలు అందక పోవడంతో మొక్కలకు వచ్చే పిందెల చోట తీగలు మారుతున్నాయి.

జిల్లాలోనే మొదటి సాగు

2018 జూన్‌లో నాటి రాష్ట్ర ఉద్యానవన, వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్థానిక రైతులను ఆర్థికంగా బలపర్చేందుకు ప్రయోగాత్మకంగా ఆయిల్ పామ్ మొక్కలను నాటించారు. రైతులు ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వ భూమిలో ఎకరానికి 57 చొప్పున 2.36ఎకరాల స్థలంలో ప్రతి 9మీటర్లకు ఒక మొక్క చొప్పున మొత్తం 136 మొక్కలను నాటించారు. రెండేళ్ల క్రితం వరకు హార్టికల్చర్ సిబ్బంది ఆదరణలో ఉన్న మొక్కలకు పిందెలు కాసి కాయలుగా మారాయి. కానీ ఓ ప్రైవేటు సంస్థకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించడంతో అవి గొడ్డుపోతున్నాయి. ఎప్పుడు ఒకే రకమైన పంటలు పండించడం, ప్రకృతి వైపరీత్యాలతో పంటనష్టపోవడం జరుగకూడదన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ మొక్కలు ఇలా కాయలు కాయక పోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. గతంలో పంచాయతీరాజ్ కమిషనర్ సైతం ఆయిల్‌పామ్ మొక్కలను సందర్శించి వాటికి పోషణ లేక పోవడంతో ఇలా అయ్యాయని వారించినా పట్టించుకోకుండా అలాగే వదిలేశారు. ఇప్పటికే జిల్లాలో వేల ఎకరాల సాగుకు ప్రాధాన్యం అందిస్తు మొక్కలను సరఫరా చేస్తున్నారు. దీని కోసం రైతులు మొదట వీటిని చూడటానికి వచ్చి ఆశ్చర్యపోతున్నారు. సాగు చేసిన అనంతరం ఇలా జరిగితే ఎలా అంటు భయాందోళనలకు గురవుతున్నారు.


ప్రైవేటు సంస్థ నిర్లక్ష్యపు వైఖరి?

ఆయిల్ పామ్ బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యతను ప్రభుత్వం ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించింది. కానీ వారి పని తీరులో నిర్లక్ష్యం నెలకొంటోంది. పనులు ముందుకు సాగడం లేదు. అధికారుల సంరక్షణలో ఉన్నన్ని రోజులు బాగానే ఉన్నా ప్రైవేటు సంస్థ చేతిలోకి వెళ్లగానే నిరాధారణకు గురవుతున్నాయి.

సబ్సిడీ ఇచ్చి మరీ పంట విస్తరణ

ప్రభుత్వం పంట విస్తరణ జరగాలని రైతులకు సబ్సిడీ ఇచ్చి మరీ మొక్కలను అందిస్తోంది. అదే తరహాలో ప్రభుత్వం స్వంత ఖర్చుతో ఏర్పాటు చేసిన ఈ పామ్ మాత్రం నిరాధరణ ఎదురయ్యింది. మొదట ఎకరాకు రూ.13వేల వరకు ఖర్చు చేశాక తర్వాత నాలుగేళ్ల రూ.10వేల వరకు ఖర్చు చేసింది. ఈ డబ్బులు అన్ని వృథా అవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

అయిల్ పామ్ సాగు చేస్తున్నా



బొప్పాస్‌పల్లి సీడ్ ఫామ్ మొక్కలను చూశాక నేను నా భూమిలో సాగు చేస్తున్నాను. ప్రతి మొక్కకు రూ.20 డీడీగా చెల్లించాను. అంతర పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నాను. మూడున్నర ఎకరాల్లో 175 మొక్కలు నాటాను నా పంట బాగా వస్తోంది.

– చందర్ నాయక్, నస్రుల్లాబాద్

సెస్ జమ చేయడంలో అలసత్వం

- జిల్లా గ్రంథాలయ సంస్థను వెంటాడుతున్న నిధుల కొరత
- గ్రంథాలయాల అభివృద్ధికి సెస్ నిధులే కీలకం

మోర్తాడ్: ఇంటి పన్నుల వసూళ్లలో భాగంగా గ్రంథాలయ సెస్‌ను తమ ఖాతాల్లో వేసుకుంటున్న పంచాయతీలు జిల్లా గ్రంథాలయ సంస్థకు మాత్రం ఆ నిధులు జమ చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నాయి. ఫలితంగా గ్రంథాలయ సంస్థకు నిధుల కొరత వెంటాడుతోంది. జిల్లాలో ఉన్న 530(కొత్తగా ఏర్పడినవి కాకుండా) జీపీలు, ఒక నగర కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీల నుంచి ఏటా రూ.3 కోట్ల ఆదాయం సెస్ రూపంలో గ్రంథాలయ సంస్థకు జమ చేయాల్సి ఉంది. నగర కార్పొరేషన్‌తో పాటు, మూడు మున్సిపాలిటీలు, కొన్ని పంచాయతీలు మాత్రం ప్రతి ఏటా క్రమం తప్పకుండా సెస్‌ను జమ చేస్తున్నాయి. చిన్న పంచాయతీలు మాత్రం సెస్‌ను తమ ఖాతాలోనే ఉంచుకుని ఖర్చులకు వినియోగించుకుంటున్నాయి. ఇప్పటి వరకు జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.2 కోట్ల నిధులు సెస్ రూపంలో అందగా మరో రూ. కోటి ఇంకా బకాయి ఉంది. గ్రంథాలయ సంస్థకు ప్రభుత్వం ప్రత్యేకించి ఎలాంటి నిధులను విడుదల చేయడం లేదు. కేవలం ఉద్యోగుల వేతనాలను మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తోంది. శాఖ గ్రంథాలయాల్లో దిన, వార, పక్ష పత్రికల బిల్లులు, కొత్త పుస్తకాల కొనుగోలు, ఇతర సౌకర్యాల కోసం సెస్ నిధులపైనే ఆధారపడాల్సి ఉంటుంది. ఉద్యోగ అన్వేషణలో ఉన్న ఎంతో మంది నిరుద్యోగులు కొన్ని నెలల నుంచి గ్రంథాలయాలను అక్కున చేరి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. గ్రంథాలయాల్లో కొత్త పుస్తకాలు, సౌకర్యాల కోసం నిధులు ఎంతో అవసరం. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగానైనా పంచాయతీలు మేలుకొని సెస్ జమ చేయడంపై శ్రద్ధ చూపాలని పలువురు సూచిస్తున్నారు.

అధికారులకు సూచన చేశాం

సెస్ నిధులు జమ చేయని పంచాయతీల సమాచారాన్ని పంచాయతీ ఉన్నతాధికారులకు అందించాం. అన్ని పంచాయతీలు వంద శాతం పన్నులను వసూలు చేస్తున్నా సెస్ చెల్లింపులో నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఇది సరైన పద్ధతి కాదు. అధికారులు చొరవ తీసుకుని సెస్‌ను జమ చేయించాలి.

– బుగ్గారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి